క్లుప్తంగా

ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం



మెల్విన్ జోన్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లయన్స్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్‌ను స్థాపించిన మెల్విన్ జోన్స్ చిత్రపటానికి అడబాల రత్నప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు లయన్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

కాపుల అండతోనే కూటమి విజయం



సమావేశంలో రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం అండగా నిలవడం వల్లే కూటమి ఘన విజయం సాధించిదని రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు వాసురెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ తదితరులు పేర్కొన్నారు. కాకినాడలో శుభం కాపు కల్యాణ మండపంలో శుక్రవారం కాపు జేఏసీ నాయకులు విజయోత్సవం నిర్వహించారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కాపు సామాజిక ఓట్లు కూటమికి వెళ్లేలా చేయడంతో సఫలీకృతులయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం కాపులు సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో నల్లా పవన్, జనపాముల నాగబాబు, రామదేవు సీతయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

నానాజీకి అభినందనల వెల్లువ



పంతం నానాజీకి అభినందలు తెలియజేస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన పంతం నానాజీకి శుక్రవారం అధికారులు, నాయకులు తదితరులు అభినందనలు తెలిపారు. కాకినాడ గుడారిగుంట నివాసంలో నానాజీని పలువురు కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు జిల్లా స్థాయి అధికారులు, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్, సిబ్బంది నానాజీకి అభినందనలు తెలియజేసిన వారిలో ఉన్నారు. నానాజీ మాట్లాడుతూ జనసేన విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

అనంతలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు

ఎన్నికల్లో తన విజయానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులకు ఎమ్మెల్యేగా గెలిచిన నానాజీ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. వలసపాకలలోని పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతుల నివాసానికి శుక్రవారం ఉదయం నానాజీ దంపతులు, కుమారుడు సందీప్ కలసి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

పోషకాల రేడు

- ఆరోగ్య ప్రదాయినిగా నేరేడుకు గుర్తింపు
- కిలో రూ.150 నుంచి రూ.200
- పండ్లే కాకుండా చెట్టులోని ప్రతి భాగం ఉపయుక్తం



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన నేరేడు పండ్లు

కాకినాడ సిటీ: ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో ఒకటైన నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే అనేక అనారోగ్య సమస్యలను, రుగ్మతలను దూరం చేస్తుంది. పట్టణంలో వ్యాపారులు తోపుడు బండ్ల ద్వారా ఈ పళ్లను విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం వ్యాపారులు వచ్చి పండ్లను విక్రయిస్తున్నారు. జూన్, జూలై నెలల్లో మాత్రమే లభించే ఈ పళ్లు రుచిలో మేటిగా ఉంటాయి. నేరేడు పండు మాత్రమే కాకుండా ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి చక్కని మేలు చేస్తాయి. నేరేడు పండులో అత్యధిక పోషకాలు ఉన్న నేపథ్యంలో పండు రూపంలోనే కాకుండా ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్ తయారు చేసుకోవచ్చు. నేరేడుకాయలను వెనిగర్, వైన్ తయారీలో ఉపయోగిస్తారు. రైతు దగ్గర దళారులు కేజీ రూ.80కి కొనుగోలు చేసి వ్యాపారులకు రూ.150కి విక్రయిస్తారు. వినియోగదారుల చేతికి వచ్చేసరికి ధర రూ.200 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడుపండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు.

ప్రయోజనాలు ఎన్నో..

- నేరేడు పళ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఎ, సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పని చేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోటిలోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. అన్ని వేళల్లో ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

తినడంలో నియంత్రణ లేకుంటే

- నేరేడు పండు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు తప్పవు.
- వగరు రుచి కలిగిన నాణ్యత లేని నేరేడు పళ్లు తింటే గొంతు నొప్పి సంభవించవచ్చు. సీజన్ మారే సమయంలో ఈ పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినరాదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి సంభవించే అవకాశం ఉంది.

నేరేడు పండులో ఔషధగుణాలు..

ప్రొటీన్లు	7 శాతం
తేమ	88 శాతం
ఐరన్	12 మిల్లీ గ్రాములు
విటమిన్ సి	18 మిల్లీ గ్రాములు
ఫాస్పరస్	18 మిల్లీ గ్రాములు
కాల్షియం	15 మిల్లీ గ్రాములు
కొవ్వు	3 శాతం
ఖనిజం	4 శాతం
పీచు	3 శాతం
పిండి పదార్థం	14 శాతం

ఆరోగ్యానికి మేలు



నేరేడు పండ్లు శరీరానికి ఎంతో మంచిది. ఈ పళ్లతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనిషిలోని పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఉపయోగపడుతుంది. పండ్లను మరుగపెట్టి నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. ఈ పండ్లలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ పళ్లు మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకుంటే రక్తం అదుపులోకి వస్తుంది.

– డాక్టర్ ఆర్.శ్రీనివాస నాయక్, కరప మండల వైద్యాధికారి

రోగులకు వైఎంవీఏ ఆధ్వర్యంలో అన్నదానం



కుష్ఠురోగులకు భోజనం వడ్డిస్తున్న సంస్థ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ 180వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని విముక్తి కాలనీ కుష్ఠు రోగులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కాకినాడ వైఎంసీఏ అధ్యక్షుడు పిఎం హెన్నీ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ పీజేవీకే గాంధీ వైఎంసీఏ కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం కుష్ఠురోగులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందును అధ్యక్ష, కార్యదర్శి, సభ్యులు వడ్డించారు. ఈ కార్యక్రంలో విముక్తి చర్చి పాస్టర్ డాక్టర్ బి.జాన్‌బెంజి, వైఎంసీఏ కాకినాడ శాఖ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి శామ్యూల్, కోశాధికారి డాక్టర్ శీరం ఐజాక్, సహాయ కోశాధికారి చప్పిడి శామ్యూల్ విక్టర్, బోర్డు మెంబరు మైకా జేసుదాసు, మోజెస్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల పరిశీలన

- రిజర్వాయర్లను సందర్శించిన కమిషనర్
- తాగునీటి నాణ్యతపై సంతృప్తి



నీటి నమూనాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు, ఎస్ఈ సత్యకుమారి

కాకినాడ: కాకినాడ నగరంలోని ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లను (ఈఎల్ఎస్ఆర్) నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శుక్రవారం సందర్శించారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి దుమ్మలపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్ ప్రాంతాలలో పర్యటించిన ఆయన అక్కడి నీటి నమూనాలను పరిశీలించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన రిజర్వాయర్లను సందర్శించారు. క్లోరిన్ నమూనాలను పరిశీలించి నీటి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాల్ పిట్ వద్ద నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కాకినాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ నగర విస్తృత సమావేశాన్ని శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక డి కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో పార్టీ ఆదేశాల మేరకు ఈ సమావేశం జరుగుతోంది. సిటీ సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తారు. నాయకులు, కార్యకర్తలు సమావేశానికి విధిగా హాజరుకావాలని పార్టీ కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న కోరారు.

వనమాడికి అధికారుల అభినందనలు



ఎమ్మెల్యే వనమాడిని కలిసిన కమిషనర్ వెంకటరావు, అధికారులు

కాకినాడ: కాకినాడ సిటీ శాసనసభ్యుడిగా ఎన్నికైన వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)ను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇతర అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్నాథపురంలోని ఆయన కార్యాలయంలో వనమాడిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు డీఈలు, ఏఈలు వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

తీరం వెంబడి పశువులు మాయం



కందికుప్ప సమీపంలో ఓ రైతు పొలంలో చెట్టుకు కట్టిన ఆవు

కాట్రేనికోన: మండలంలో కొత్తపాలెం లైట్ హౌస్ ప్రాంతం, మడ అడవులు, సముద్ర తీరం వెంబడి సరుగుడు తోటల్లో సంచరిస్తున్న ఆవులు, గేదెలను పశువుల మాఫియా తరలించుకుపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దుశ్చర్యకు ఎవరు అడ్డుకట్ట వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పశువుల మాఫియా.. కొందరు స్థానికులతో కుమ్మక్కై, గుట్టుచప్పుడు కాకుండా బొలెరో, టాటా ఏస్ వాహనాల్లో పశువులను తరలించుకుపోతున్నట్టు చర్చించుకుంటున్నారు. మండలంలో పాడి రైతులు పాలు ఇవ్వని, గర్భం దాల్చిన ఆవులు, గేదెలను, దూడలను మడ అడవులు, సముద్ర తీరం వెంబడి ఉన్న సరుగుడు తోటల్లో వదిలి వేస్తారు. మండలంలోని చెయ్యేరు, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం, గచ్చకాయపోర, చిర్రయానం, బలుసుతిప్ప, కందికుప్ప, పల్లంకుర్రు, దొంతికుర్రు, తదితర ప్రాంతాలకు చెందిన పాడి రైతులు పాడి పశువులు పోషించలేక మడ అడవులు, సరుగుడు తోటల్లో విడిచిపెడతారు. ఆవులు, గేదెలు గర్భం దాల్చి ఈనే సమయాన్ని గుర్తించి, ఇంటికి తెచ్చుకుంటారు. మగసానితిప్ప, కందికుప్ప లైట్ హౌస్ ప్రాంతంలోని మడ అడవులు, సరుగుడు తోటలు, చిర్రయానం నుంచి కొత్తపాలెం మొగ ప్రాంతం వరకూ సముద్ర తీరం వెంబడి వందలాది పశువులు సంచరిస్తూ ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో సంచరించే ఆవులు, గేదెలు స్థానికులకు చెందినవి కాకపోవడం, ఇతర ప్రాంతాలకు చెందిన పాడి రైతులవి కావడంతో కొందరు స్థానికుల సహకారంతో దళారులు పశువులను తరలించుకు పోతున్నారు. పశువుల మాఫియా అదను చూసి పశువులను వాహనాల్లో కబేళాలకు తరలించుకుపోతున్నారని అంటున్నారు. కాట్రేనికోన పోలీసు స్టేషన్‌లో పాడి గేదెలు కనబడటం లేదని పలు ఫిర్యాదులు ఉన్నాయి. కందికుప్పకు చెందిన పాడి రైతు గేదె పాలు తగ్గిపోవడంతో గర్భం దాల్చిన తర్వాత లైట్ హౌస్ ప్రాంతంలో సరుగుడు తోటల్లో వదిలివేశారు. గేదెను వారం రోజులకు ఓసారి వెళ్లి చూసుకునేవారు. గేదె ఆచూకీ లేకపోవడంతో తీర ప్రాంతం వెంబడి మడ అడవులు, సరుగుడు తోటలు, పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో గత నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న పోలీసులు దీనిపై దృష్టి సారించలేకపోయారు.

వాహనం స్వాధీనం

గురువారం రాత్రి టాటా ఏస్ వాహనంలో పశువులను కబేళాలకు తరలించుకు పోతున్నట్టు స్థానికుల సమాచారంతో, పోలీసులు ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆవులను కందికుప్ప సమీపంలో వదిలి వేసిన పోలీసులు, వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. దీనిపై కాట్రేనికోన ఎస్సై నాగేశ్వరరావును వివరణ కోరగా, ఆవులను తరలిస్తున్న వాహనాన్ని అదుపులోనికి తీసుకున్నామని, ఆవులను స్థానికుల నుంచి కొనుగోలు చేశామని డ్రైవర్ తెలిపార న్నారు.

లలిత కళలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం ప్రేమజ్యోతి

బోట్‌క్లబ్: మానసిక ఉల్లాసానికి లలిత కళలు ఎంతో ఉపయోగపడతాయని పీఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమజ్యోతి అన్నారు. స్థానిక గాంధీనగర్ మున్సిపల్ చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలో ఉన్న బాలభవన్‌లో శుక్రవారం వేసవి శిక్షణ తరగతులు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలల మనో వికాసానికి, మానసిక ఉల్లాసానికి లలితకళలు చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. బాలభవన్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. అనంతరం పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటీవల జరిగిన కరాటే టోర్నమెంట్ విజేతలకు స్వర్ణ, రజిత కాంస్య పతకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ పర్యవేక్షకులు శారద, బాలభవన్ ఉపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, కరాటే మూర్తి, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగించాలి

బోట్‌క్లబ్: ఈనెల 14తో భారత ఆధార్ అప్‌డేట్ గడువు ముగుస్తున్నంన నూతన ప్రభుత్వాలు గడువు పొడిగించాలని పౌర సంక్షేమ కన్వీనర్ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. నూతన ప్రభుత్వ మేనిఫెస్టో పథకాలకు తగిన అర్జీలు దాఖలు చేసుకునే ప్రక్రియ ఏర్పడనున్న నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ లేకుంటే పేదలు, సామాన్య మధ్య తరగతి ప్రజలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పదేళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారు తమ డెమోగ్రఫిక్ వివరాలు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థకు అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. నగరంలో తగినన్ని ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు లేకపోవడం, సాంకేతిక పరిజ్ఞానం కొరవడటం, సార్వత్రిక ఎన్నికల హడావుడిలో అప్‌డేట్ చేసుకోలేదన్నారు. ఫీజులతో ప్రమేయం లేకుండా మరో మూడు నెలల గడువు పొడిగించాలని ఆయన కోరారు.

మోదీతోనే దేశాభివృద్ధి

కాకినాడ రూరల్: మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న నరేంద్రమోదీకి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రమణయ్యపేట సురేష్‌నగర్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు నాయకులతో కలసి స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా రంబాల మాట్లాడుతూ మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, పార్టీ నాయకులు కొమ్మిరెడ్డి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు కవికొండల భీమశేఖర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెండెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొలిమి మండితేనే కలిమి

- నిప్పుల మాటున వేగిపోతున్న కమ్మర్ల జీవితాలు
- పెరిగిన ముడి సరకుల ధరలు
- నైపుణ్యం, నాణ్యత ఉన్నా వ్యాపారం అంతంత మాత్రమే
- యాంత్రీకరణతో చిన్నాభిన్నం అవుతున్న కుల వృత్తులు



ఇనుప ముక్కను కొలిమిలో కాలుస్తున్న కమ్మర్లు

సామర్లకోట: వ్యవసాయ పనిముట్లకు అవసరమైన పరికరాల తయారీలో పట్టణంలోని కమ్మర్లకు మంచి పేరుంది. ఇక్కడ తయారైన పరికరాలు నాణ్యమైనవి కావడంతో డిమాండ్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. జిల్లాలోని అనేక ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి వ్యవసాయ పరికరాలతో పాటు, గృహోపకరణాలు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనిముట్లకు ప్రస్తుతం గిరాకీ ఏర్పడింది. తాము తయారు చేసే వస్తువులకు డిమాండ్ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని తయారీదారులు వాపోతున్నారు. ముడి సరుకు ధరలు పెరగడంతో పాటు, తయారీదారులు ఏటేటా తగ్గిపోవడం.. అవసరమైన సహాయకులు లేకపోవడంతో పనిభారం పెరుగుతోందని వారు అంటున్నారు. బొగ్గుల కొలిమిని తయారు చేయడానికి ఒకరు, ఇనుప ముక్కలను బొగ్గులలో ఉంచడానికి మరొకరు, ఎర్రగా కాలిన ఆ ఇనుప ముక్కలను సుత్తి, సమ్మెటలతో కొట్టడానికి మరొకరు పని చేస్తూ ఉంటారు.

నియోజకవర్గ పరిధిలోని సామర్లకోటలో 15 వరకు కమ్మరశాలలు ఉన్నాయి. వీటిలో నిపుణులైన పనివారు 20 మంది వరకు ఉంటారు. మొత్తంగా వారికి సహాయకులుగా 40 మంది వరకు పనిచేస్తుంటారు. ఏడాదికి రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టి వ్యవసాయ పనిముట్లు, ఇంటి అవసరాలకు అవసరమైన పరికరాలను తయారు చేసి విక్రయిస్తే రూ.3 లక్షల వ్యాపారం జరుగుతుంది.

వ్యవసాయ పనిముట్లకు అవసరమైన కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, తవ్వుగళ్లతోపాటు వంట సామగ్రికి ఉపయోగించే అట్ల రేకులు, పెనం, అట్లకాడ వంటి పరికరాలను తయారు చేస్తారు. అయితే ప్రస్తుతం యంత్రాలతో తయారు చేసిన వస్తువులు రావడంతో వీరికి డిమాండ్ తగ్గిపోయింది. కాకినాడ, భీమవరం, రాజమహేంద్రవరం నుంచి 100 కిలోల ముడి ఇనుము రేకు రూ.90 వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తుకొంటున్నారు.

యంత్రాలతో తట్టుకోలేని పోటీ..

వివిధ రకాల యంత్రాలతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించడం వల్ల కమ్మర్లు తయారు చేసే వస్తువులు నాణ్యతగా ఉన్నప్పటికీ కొనుగోలు చేసేవారు తగ్గిపోయారు. అలాగే గతంలో ఇనుముతో తయారు చేసిన పెనం, అట్లకాడ స్థానే స్టీలుతో తయారైన అట్లకాడలు, మూకుళ్లు వినియోగించడంతో తాము తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసేవారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 50 ఏళ్లుగా ఒకే రకమైన జీవితాలను గడుపుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. తమకు సంఘం లేక పోవడం వల్ల ఐక్యత లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10న రైతు సమస్యలపై సదస్సు

తాళ్లరేవు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఉదయం 9 గంటలకు పి.మల్లవరం పంట కాలువ వద్ద సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో ప్రధానంగా సాగునీటి సమస్యకు కారణమైన పంట కాలువల్లో పెరిగిపోయిన పూడికలు, ఇంజరం వంతెన నిర్మించక పోవడం, ప్రత్యామ్నాయ రోడ్డు తొలగించకపోవడం, పంట పొలాలకు వచ్చే సాగునీటిని చమురు సంస్థలు తరలించుకుపోవడం తదితర సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. ఈ సదస్సుకు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులతో పాటు, మండల ఉన్నతాధికారులు కూడా హాజరయ్యేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో రైతులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు చిన్న, సన్నకారు రైతులు, భూ యజమానులు సదస్సులో పాల్గొనాల్సిందిగా రాజబాబు కోరారు. రైతులు పితాని సత్యనారాయణ, పేరాబత్తుల సాయినరేంద్ర పాల్గొన్నారు.